క్లుప్తంగా

శాకంబరీ నమోస్తుతే


శాకంబరీ దేవీగా అమ్మవారు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని నెహ్రూనగర్‌లో ఉన్న మహాబలేశ్వరాలయంలో వెలసిన అమ్మవారు భక్తులకు శాకంబరీగా దర్శనమిచ్చారు. ఆషాఢ శుక్రవారాన్ని పురస్కరించుకొని అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం సామూహిక కుంకమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

కనీస వేతనాలు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మునెప్ప

కర్నూలు(సెంట్రల్): ఏపీఎస్ ఆర్టీసీలో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏపీపీటీడీ అవుట్‌సోరింగ్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఆర్టీసీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు యాజమాన్యం నిర్ణయించిన మేరకు కాంట్రాక్టర్లు వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఇచ్చే వేతనాల్లో భారీ వ్యత్యాసాలు ఉంటున్నాయన్నారు. లేబర్ యాక్ట్ ప్రకారం కార్మికులకు రావాల్సిన వేతనాలు ఇవ్వకపోగా పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాన్ని కూడా కల్పించడం లేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాన్ని కల్పించని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. వెంటనే కార్మికులకు ఈఎస్ఐ కార్డులను పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏవీ రెడ్డి, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రార్థన మందిరాన్ని తెరిపించండి


మాట్లాడుతున్న సంఘ పెద్దలు, సభ్యులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు లక్ష్మీనగర్‌లోని క్రిస్టియన్ అసెంబ్లీ ప్రార్థన మందిరాన్ని తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని సంఘ పెద్దలు, సభ్యులు కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతిపత్రం అందించారు. కొందరి స్వార్థంతో ప్రార్థన మందిరానికి తాళాలు వేయడంతో 500 మందికిపైగా భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అందులో పేర్కొన్నారు. శుక్రవారం సంఘ పెద్దలు, సభ్యులు కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలుసుకొని ప్రార్థన మందిరంలో జరుగుతున్న కొందరి పెత్తనాన్ని వివరించారు. అనంతరం సంఘ పెద్దలు దానమయ్య, నారాయణదాస్ మాట్లాడుతూ.. ప్రార్థన మందిరంపై రెండు కేసులు కోర్టులో నడుస్తున్నాయన్నారు. తీర్పు ఎలా వచ్చినా స్వీకరించడానికి ఇరువర్గాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ క్రమంలో ప్రార్థనలు సజావుగా సాగుతున్న తరుణంలో రాంబాబు, ప్రభుదాస్ అలియాస్ కృష్ణయ్య ఆధిపత్యం కోసం చర్చిలో గొడవలు పెట్టుకొని తాళాలు వేసి మూసి వేశారని వివరించారు. ఎవరైనా అడిగితే ప్రతి ఆదివారం వచ్చే కానుకలో వాటా ఇవ్వాలని అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే అక్కడి సీఐ తహసీల్దార్‌ను కలవమని చెబుతున్నారని, అక్కడికి వెళ్లితే ఆయన పట్టించుకోకపోవడంతో కలెక్టర్‌ను కలిసినట్లు చెప్పారు.

ప్రమాదకరంగా ‘మ్యాన్‌హోల్స్’


పాతబస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహం వెనుక నడిరోడ్డుపై మ్యాన్‌హోల్ గుంత

కర్నూలు (న్యూటౌన్): నగరంలోని పాతబస్టాండులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వెనుక నడిరోడ్డుపై పెద్దగుంత ఏర్పడింది. మురుగుకాల్వపై వేసిన గ్రిల్ కుంగిపోవడంతో గుంత ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. అలాగే కర్నూలు అర్బన్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎదురుగా మ్యాన్‌హోల్ గ్రిల్ కుంగిపోయింది. ప్రతిరోజూ ఈ రహదారిగుండా వందల వాహనాలు వెళ్తూ ఉంటాయి.ఆదమరిస్తే ఆ గుంతలో పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.


కర్నూలు అర్బన్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎదురుగా ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

‘పల్లె’వించని బ్యాంకు సేవలు!

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో చాలా పల్లెల్లో కనిపించని బ్యాంకులు
- నేటితో బ్యాంకుల జాతీయకరణ జరిగి 56 ఏళ్లు పూర్తి

నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంలో రాచర్ల, బూరుగల పెద్ద గ్రామాలు. రాచర్లలో ఎస్‌సీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కూడా ఉంది. రాచర్లలో కనీసం 6 వేల జనాభా, బూరుగలలో 8 వేల జనాభా ఉంటుంది. ఈ గ్రామాలకు బ్యాంకు సేవలు అందుబాటులో లేవు. నల్లమేకలపల్లి, జక్కసానుకుంట్ల, పీఆర్‌పల్లి గ్రామాల ప్రజలు బ్యాంకు సేవల కోసం హుసేనాపురం గ్రామానికి రావాల్సి ఉంది. ఇటువంటి గ్రామాలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎన్నో ఉన్నాయి.

కర్నూలు(అగ్రికల్చర్): బ్యాంకింగ్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు విస్తరింపచేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. ప్రతి 2,000 జనాభాకు ఒక బ్యాంకు ఉండాలని ఆర్‌బీఐ నిబంధన విధించినా అమలు కావడం లేదు. బ్యాంకింగ్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు అందాలనే లక్ష్యంతోనే భారత ప్రభుత్వం 1969 జూలై 19న బ్యాంకులను జాతీయం చేసింది. ఇప్పటికీ 56 ఏళ్లు పూర్తి అవుతున్నప్పటికీ బ్యాంకుల సేవలు అందని గ్రామాలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 75 ఉన్నాయి.

అందని బ్యాంకుల సేవలు

భారత ప్రభుత్వం బ్యాంకు ఖాతాల ద్వారా అనేక సేవలు అందిస్తోంది. బ్యాంకుల్లో ఖాతా ఉంటే నామమాత్రం మొత్తంతో బీమా సదుపాయం పొందే అవకాశం కూడా ఉంది. కాని బ్యాంకులు సామాన్యులకు అందనంత దూరంలో ఉండిపోయాయి. ప్రధానంగా నంద్యాల జిల్లాలో నల్లమల ప్రాంతంలో ఉండే గ్రామాలు, చెంచుగూడెంలకు బ్యాంకులు సేవలు అందని పరిస్థితి ఉంది. కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలోనూ ఇదే దుస్థితి నెలకొంది.

ఇవీ కష్టాలు..

- రైతులకు రుణాలు, విద్యార్థుల చదువుకు లోన్లు ఇవ్వడంలో పబ్లిక్ సెక్టారు బ్యాంకులు ముందు ఉన్నాయి. అలాగే ప్రజలు పొదుపు చేసిన డబ్బుకు భద్రత కల్పిస్తున్నాయి. బ్యాంకులు ప్రయివేటు పరం అయితే బ్యాంకుల్లో ఖాతా ప్రారంభించాలంటే రూ.5000 ఖర్చు చేయాల్సి ఉంది.
- జీరో బ్యాలెన్స్‌తో ప్రధానమంత్రి జందన్ యోజన ఖాతాలు నంద్యాల జిల్లాలో 6,13,068, కర్నూలు జిల్లాలో 9,22,830 ఉన్నాయి. బ్యాంకుల విలీనంతో సగానికిపైగా ఖాతాలు వినియోగంలో లేకుండా పోయాయి.



ఉమ్మడి కర్నూలు జిల్లాలో బ్యాంకు బ్రాంచ్‌ల వివరాలు..

జిల్లా	పంచాయతీలు	బ్యాంక్ బ్రాంచ్‌లు
కర్నూలు	484	276
నంద్యాల	489	246

గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలి

ప్రభుత్వ రంగ బ్యాంకులు సమర్థవంతమైన ఆర్థిక వ్యవస్థకు, యువతకు ఉద్యోగాల కల్పనకు, గ్రామీణాభివృద్ధికి తోడ్పడుతున్నాయి. మళ్లీ బ్యాంకుల ప్రయివేటీకరణకు అడుగులు పడుతున్నాయి. యువతకు ఉద్యోగాలు లభించని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వ బ్యాంకులను గ్రామీణ ప్రాంతాలకు విస్తరింపచేయాలి.

– అనిల్‌రెడ్డి, యూత్ కౌన్సిల్ మెంబర్, ఏపీ, తెలంగాణ బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్, కర్నూలు

- గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు బ్రాంచ్‌లు ఏర్పాటు చేయకుండా బిజినెస్ కరస్పాండెంట్లను నియమించి చేతులు దులుపుకుంటున్నాయి. బిజినెస్ కరస్పాండెంట్లు లావాదేవీలపై ప్రజల నుంచి కమీషన్ వసూలు చేస్తున్నారు.
- ప్రస్తుతం పబ్లిక్ సెక్టారు బ్యాంకులు 12, ప్రయివేట్ సెక్టారులో 13 బ్యాంకులు ఉన్నాయి. ఆంధ్రా బ్యాంకు, విజయ బ్యాంకు, దేనాబ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకు, సిండికేట్ బ్యాంకు, అలహాబాదు బ్యాంకు, ఓరియంటల్ బ్యాంకు, యునైటెడ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రస్తుతం లేవు. బ్యాంకుల విలీనం ప్రక్రియ మొదలైన తర్వాత ఉద్యోగాల నోటిఫికేషన్లు గణనీయంగా తగ్గిపోయాయి.

మంత్రి గారూ.. రౌడీషీటర్లను కట్టడి చేయండి

- వ్యాపారుల్లో భయాందోళన నెలకొంది
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి


టీడీపీ గూండాల దాడిలో ధ్వంసమైన వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయాన్ని పరిశీలిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): మంత్రి టీజీ భరత్ గారు.. నగరంలో రౌడీషీటర్లను కట్టడి చేయండి. రాత్రి వేళ మద్యం తాగి వ్యాపారులను బెదిరిస్తున్నారు. ఇది మంచి సంప్రదాయం కాదు. ప్రశాంతంగా ఉన్న కర్నూలు నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి సూచించారు. నగరంలోని 10వ వార్డు కార్పొరేటర్ షేక్ యూనుస్ బాషా ఉన్న వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయాన్ని టీజీకి చెందిన గూండాలు గురువారం రాత్రి ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్వీ మోహన్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. కార్యాలయంలో వస్తువులన్నీ పగులగొట్టి ఉండటం, కంప్యూటర్, టీవీ ధ్వంసమై ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో వ్యాపారులు ఎక్కువగా ఉన్నారన్నారు. ఇటీవల వ్యాపారాలు చేసుకోవాలంటే భయాందోళనలకు గురవుతున్నారన్నారు. టీడీపీ గుండాలు రెచ్చిపోతున్నారని మండిపడ్డారు. వ్యాపారవేత్తగా మంత్రి టీజీ భరత్ చొరవ తీసుకొని ఇటువంటి శక్తులను కట్టడి చేయాలన్నారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు షేక్ యూనుస్ బాషా కార్యాలయంపై దాడి చేయడం తగదన్నారు. కర్నూలు నగరంలో కొత్త సంప్రదాయానికి తెరతీస్తున్నారని, టీడీపీ నాయకుల దుర్మార్గం రోజురోజుకు పెరుగుతోందన్నారు. గతంలో ఇలాంటి రౌడీయిజం ఎప్పుడూ లేదన్నారు. వచ్చే 8 నెలల్లో కార్పొరేషన్ ఎన్నికలు వస్తున్నాయని, భయభ్రాంతులకు గురిచేసేందుకు దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. దాడి చేసిన టీడీపీ గుండాలు తమపైనే దాడులు జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడం దుర్మార్గమన్నారు. పార్టీ నాయకులు, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర నిధుల వినియోగంపై పారదర్శకత అవసరం

- రికార్డులు సక్రమంగా నిర్వహించడం లేదు.
- ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన ఇళ్ల నిర్మాణంలో వివరాలు లేవు
- గ్రామ పంచాయతీల్లో రికార్డులు లేవు
- ఎస్‌ఎల్‌ఎం టీమ్ ప్రతినిధుల వెల్లడి.. జిల్లాలో ముగిసిన పర్యటన


మాట్లాడుతున్న ఎస్‌ఎల్‌ఎం టీమ్ ప్రతినిధులు

కర్నూలు(అగ్రికల్చర్): కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధుల వినియోగం క్షేత్రస్థాయిలో మార్గదర్శకాలకు అనుగుణంగా జరగడం లేదని ఎస్‌ఎల్‌ఎం టీమ్ గుర్తించింది. నిధుల వినియోగానికి సంబంధించి రికార్డులు సక్రమంగా నిర్వహించడం లేదని పెదవి విరిచింది. కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంపై దాదాపు 10 రోజులుగా చేస్తున్న తనిఖీలు శుక్రవారం ముగిశాయి. ఈ నేపథ్యంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన లైన్ డిపార్టుమెంట్ అధికారుల సమావేశంలో కొన్ని సూచనలు చేశారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద నిర్మిస్తున్న ఇళ్లకు సంబంధించి సమగ్రమైన వివరాలు లేవని టీమ్ ప్రతినిధులు సంతోష్, సూర్యకాంత్ అన్నారు. ఈ ఇళ్లకు ఉపాధి నిధుల నుంచి 90 పనిదినాలు ఇవ్వాల్సి ఉందని, అయితే ఎన్ని కుటుంబాలకు 90 రోజుల పనిదినాలు ఇచ్చారనే దానిపై స్పష్టత లేదని పేర్కొన్నారు. ఉపాధి నిధుల వినియోగానికి సంబంధించి మరింత పారదర్శకత ఉండాలన్నారు. సెంట్రల్ నిధుల వినియోగానికి సంబంధించి గ్రామ పంచాయతీల్లో రికార్డులు ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ ఎక్కడా రికార్డులు లేవని చెప్పారు. మార్గదర్శకాలు తూచా తప్పకుండా పాటిస్తూ కేంద్రం నిధులను వినియోగించుకోవాలనిన్నారు. డ్వామా పీడీ వెంకటరమణయ్య మాట్లాడుతూ.. ఉపాధి నిధులను మరింత పారదర్శకంగా వినియోగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు పీడీ మాధవీలత, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ నెల 19 నుంచి ఈ టీమ్ నంద్యాల జిల్లాలో పర్యటించనుంది.

ఏఐఐబీ పనుల పూర్తికి త్వరలో నిధులు


ఇంజినీర్లతో సమావేశం నిర్వహిస్తున్న పీఆర్ ఎస్ఈ వీ.రామచంద్రారెడ్డి

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఏషియన్ ఇన్‌ఫ్రాక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ) ఆధ్వర్యంలో చేపట్టిన పనుల పూర్తి త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని, వివిధ కారణాలతో నిలిచిపోయిన పనులను ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారని పీఆర్ ఎస్ఈ వి.రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో కర్నూలు, నంద్యాల, ఆదోని ఈఈ, డీఈఈలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకు ఏఐఐబీ నిధులతో మొత్తం 139 పనులు మంజూరు కాగా, వీటిలో వివిధ కారణాల వల్ల 29 పనులు డ్రాప్ అయ్యాయన్నారు. మిగిలిన 110 పనుల్లో ఇప్పటి వరకు 76 పూర్తి కాగా, మిగిలిన 34 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇందులో రూ.24 కోట్ల అంచనాతో ప్రారంభించిన గోరంట్ల బ్రిడ్జి పనులు ఇప్పటి వరకు దాదాపు 15 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను 2026 మార్చి నాటికి పూర్తి చేయాల్సి ఉందన్నారు. మొత్తం 34 పనులకు అవసరమైన రూ.96 కోట్లు విడుదలవుతాయని, ఎప్పటిలోగా వీటిని పూర్తి చేస్తారో తెలపాలన్నారు. నిధులు విడుదలైతే రోడ్లకు సంబంధించిన అన్ని పనులను మూడు నెలల్లో పూర్తి చేస్తామని ఇంజనీర్లు స్పష్టం చేశారు. ఇంజనీర్ల అభిప్రాయాలను ఈఎన్‌సీ కార్యాలయానికి పంపుతామని ఎస్ఈ తెలిపారు. సమావేశంలో ఈఈలు సీఎస్‌సీ మద్దన్న, బీసీ వెంకటేష్, రఘురామిరెడ్డి, డీఈఈలు బండారు శ్రీనివాసులు, రవీంద్రారెడ్డి, మహేశ్వరరెడ్డి, నాగిరెడ్డి, లక్ష్మీనారాయణ, మల్లికార్జున, రమేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం

కర్నూలు(రూరల్): స్థానిక ఏ.క్యాంపులోని తన కార్యాలయంలో శనివారం వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ తెలిపారు. సమావేశానికి కుడా మాజీ చైర్మన్, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి హాజరుకానున్నారని, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టండి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చంద్రప్ప కోరారు. శుక్రవారం టీఎస్ఎఫ్ నేతలు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కొండయ్యను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో అనేక సంవత్సరాలుగా పదోన్నతులు చేపట్టకపోవడం వల్ల అర్హత కలిగిన పలువురు ఉపాధ్యాయులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల అర్హతలను అనుసరించి పదోన్నతులు కల్పించాలని కోరారు. అలాగే గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలను తరచూ తనిఖీలు చేసి విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా గురుకులాలు, పాఠశాలల్లో విద్యార్థులకు వసతులను మెరుగుపరచాలన్నారు. డీటీడబ్ల్యూఓను కలిసిన వారిలో అంబేడ్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్షావలి, టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామరాజు, పి.వెంకటేష్ ఉన్నారు.

భూసేకరణ పరిహారం ఆలస్యం చేయొద్దు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సెక్రటరీ కాంతిలాల్ దండే


హాజరైన అధికారులు

కర్నూలు (సెంట్రల్): రోడ్ల భూసేకరణకు సంబంధించి రైతులకు పరిహారం పెండింగ్‌లో లేకుండా చూడాలని రవాణా, రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కాంతిలాల్ దండే అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్అండ్‌బీ, నేషనల్ హైవే రోడ్లు, ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, రవాణా, ఆర్టీసీ అంశాలపై ఆర్అండ్‌బీ, నేషనల్ హైవే, రెవెన్యూ, రవాణా, ఆర్టీసీ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్‌హెచ్ – 340, 340సీ, 150సీ, 40 నేషనల్ హైవేస్ రోడ్లు, ప్రాజెక్టులకు సంబంధించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన సమస్యలు ఉంటే తెలపాలని అధికారులను కోరారు. ఎన్‌హెచ్ – 150 సీ కి సంబంధించి బసాపురం, దిన్నెదేవరపాడులో భూసమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు ఆయన దృష్టికి తెచ్చారు. వాటిని వారం రోజుల్లోపు పరిష్కరించాలని ప్రిన్సిపాల్ సెక్రటరీ కర్నూలు ఆర్డీఓను ఆదేశించారు. అలాగే కర్నూలు–దోర్నాల రోడ్డుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను కూడా వారంలోపు పరిష్కరించాలని కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్‌బాబును ఆదేశించారు. భూసేకరణ పరిహారం పంపిణీలో జాప్యం లేకుండా చూడాలని, జ్యుడీషియల్ కోర్టుల్లో టాయిలెట్ల నిర్మాణాలను ఆగస్టులోపు పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డిని ఆదేశించారు. మరోవైపు ప్రమాదాలు జరగకుండా రోడ్డు భద్రతపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌ను పరిశీలించాలని పోలీసులు, ఆర్టీఓ అధికారులను ఆదేశించారు. బస్టాండ్లలో పారిశుద్ధ్యం పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించనున్న నేపథ్యంలో పూర్తి వివరాలతో జిల్లాకు సంబంధించిన నివేదిక ఇవ్వాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ.. జాతీయ రహదారుల్లో గుర్తించిన బ్లాక్ స్పాట్‌లలో ప్రమాదాల నివారణ కోసం దాదాపు రూ.2 కోట్లకు పైగా విలువ చేసే సైన్ బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వివిధ రోడ్ల భూసేకరణకు సంబంధించి తరచూ సమీక్షలు నిర్వహించుకుని ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పీఆర్వో వెంకటనారాయణమ్మ, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలు సందీప్‌కుమార్, భరత్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, డీటీసీ శాంతకుమారి, నేషనల్ హైవేస్ డిప్యూటీ కలెక్టర్ సునితాబాయి పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని సనత్ నగర్‌లో ఉన్న అయాన్ డిజిటల్ జోన్ కేంద్రంలో జరుగుతున్న ఏపీపీఎస్‌సీ పరీక్షలను డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలు మేరకు పరీక్షలు నిర్వహించాలని, అభ్యర్థులకు మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రం వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

క్యాజువాలిటీ వైద్యులపై విచారణ

కర్నూలు(హాస్పిటల్): క్యాజువాలిటీలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వైద్యులపై కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు విచారణకు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఎమర్జెన్సీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై.శారద, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.వీ. కిరణ్‌కుమార్‌లను విచారణాధికారులుగా నియమించారు. ఈ నెల 17న ఓ యువకుడి ఎంఎల్‌సీని అవుట్ పోస్ట్‌కు పంపించడంలో వైద్యులు నిర్లక్ష్యం వహించారని ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సభ్యులు పి.టి.సాయిప్రదీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన ఈ చర్యలు చేపట్టారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు షోకాజ్ నోటీసులు

కర్నూలు (టౌన్): కొత్త కమిషనర్ కదా.. ఒకటి రెండు రోజులు శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ ఉంటుందిలే అని అనుకున్నారో? ఏమో? తెలీదు కానీ, కమిషనర్ తనిఖీలకు వచ్చినా సిబ్బంది కనిపించలేదు. దీంతో కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికే పారిశుద్ధ్యంపై అనేక ఫిర్యాదులు, సిబ్బంది పనిచేయడం లేదని, అధికారుల పర్యవేక్షణ లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయి. అందులో భాగంగానే కమిషనర్ ఈ విభాగంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. తాజాగా శుక్రవారం నగరపాలక పారిశుద్ధ్య విభాగంలో పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులకు కమిషనర్ పి.విశ్వనాథ్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. శానిటేషన్ పనుల తనిఖీకి వెళ్లిన కమిసనర్‌కు ఆయా డివిజన్ల పరిధిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులు విధుల్లో కనిపించలేదు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించారన్న కారణంగా కమిషనర్ వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇందులో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ముర్తుజా వలి, అనిల్, ఏ.శ్రీనివాసులు, యం.శ్రీనివాసరావు, అంజనేయులు గౌడ్‌తో పాటు సచివాలయాల కార్యదర్శులు మద్దిలేటి, క్రిస్టినా, మల్లేశ్వరి, సుదీర్, సురేష్ నోటీసులు అందుకున్నారు.

విద్యతోనే సమాజంలో మార్పు


టీసీ లక్ష్మమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐద్వా, సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): విద్యతోనే సమాజం మార్పు చెందుతుందని సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు అన్నారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో టీసీ లక్ష్మమ్మ పదో వర్ధంతి పురస్కరించుకొని ఐద్వా ఆధ్వర్యంలో ‘ప్రస్తుత సమాజంలో మహిళలు’ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముందుగా ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు అధ్యక్షతన టీసీ లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. టీసీ లక్ష్మమ్మ బ్రాహ్మణ కులంలో పుట్టినా అన్ని మతాలు, కులాల వారిని ఆదరించారని, కుటుంబ బాధ్యతలను మహిళలు తీసుకుంటే ఆ కుటుంబం ఎంతో ఉన్నతంగా ఉంటుందని ఆకాంక్షించినట్లు చెప్పారు. 5వ తరగతి వరకు చదువుకున్న ఆమె మానవ సంబంధాలపై ఎంతో ముందుచూపుగా ఉండేదన్నారు. మహిళలు పురుషులతో సమానంగా ఉండి ఆర్థిక సాధికారత కోసం కృషి చేయాలని ఆమె నిత్యం చెప్పేదన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో భార్యాభర్తలిద్దరూ పనిచేస్తే తప్పా పూట గడవని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మహిళలు నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల మాట్లాడుతూ.. టీసీ లక్ష్మమ్మ అందరికీ అమ్మ అని చెప్పారు. ఆమె బుధవారపేట, పాతబస్తీలో బీడీ కార్మికులతో కలిసి పనిచేస్తూ వారి వేతన పెంపునకు కృషిచేశారన్నారు. అలాగే మున్సిపల్ కార్మికుల సమస్యలను తెలుసుకొని పరిష్కారం చేసేవారన్నారు. ఆమె పాడిపోషణ, టైలర్‌గా పనిచేస్తూ మహిళా సంఘానికి ఎనలేని సేవలు చేశారన్నారు. కార్యక్రమంలో పద్మ, అరుణమ్మ, ఎండీ ఆనంద్ బాబు, ఎం.గోపాల్, పీఎస్ రాధాకృష్ణ బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కల్లూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. శుక్రవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి చెట్లమల్లాపురం గ్రామంలో నిర్వహిస్తున్న డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాధారణంగా డెంగీ వ్యాధి దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. ఇంటి పరిసరాల్లో, నీటి గచ్చులు, గుంతలు, డ్రమ్ములు మొదలగు వాటిలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దీనిపై ఏఎన్‌ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఒక వేళ జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకులు స్వర్ణ గౌరీ, ఆరోగ్య విస్తరణ అధికారి విజయ్‌కుమార్, సూపర్‌వైజర్లు నాగరాజు, మద్దమ్మ, ఏఎన్‌ఎమ్ ప్రశాంతి, ఆశా కార్యకర్తలు ఖలీల్ పాల్గొన్నారు.


ఆస్పత్రిపై దాడి చేసిన వారిని శిక్షించాలి


మాట్లాడుతున్న అప్నా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): ఎక్కడో బయట చనిపోయిన రోగిని తీసుకొచ్చి, ఆస్పత్రిలో చనిపోయిందని ఆరోపిస్తూ శ్రీచక్ర హాస్పిటల్‌పై దాడులు చేశారని, అన్యాయంగా ఆస్పత్రిని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీ ప్రైవేటు నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (అప్నా) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం అప్నా, ఐఎంఏ నాయకులు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని కలిసి వినతి పత్రాలు సమర్పించారు. అనంతరం డాక్టర్స్ కాలనీలోని ఐఎంఏ భవన్‌లో డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. కల్లూరుకు చెందిన అనిత మంగళవారం శ్రీచక్ర హాస్పిటల్‌లో చికిత్స తీసుకుని వెళ్లిపోయిందని, బుధవారం అర్ధరాత్రి ఆమె అపస్మారక స్థితిలో ఉండగా చికిత్స కోసం తీసుకొచ్చారని, వైద్యులు పరీక్షించగా ఆమె అప్పటికే మరణించిందన్నారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానికంగా ఉన్న ఆర్ఎంపీల వద్ద చికిత్స చేయించుకున్నామని ఆమె భర్తే ఓ వీడియోలో చెప్పారని, బయట మరణించిన వ్యక్తిని ఆస్పత్రికి తీసుకొచ్చి గొడవ చేశారని చెప్పారు. ఇందులో మృతురాలి కుటుంబసభ్యుల కంటే బయటి వారి ప్రమేయం ఎక్కువగా కనిపిస్తోందన్నారు. ఉద్దేశపూర్వకంగా ఆస్పత్రిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారన్నారు. మెడికేర్ సర్వీస్, ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం దాడులకు పాల్పడిన వారిని, వైద్యులను అసభ్య పదజాలంతో దూషించి దాడి చేసిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. శ్రీచక్ర హాస్పిటల్ అధినేత డాక్టర్ విజయకుమార్ రెడ్డి, ఐఎంఏ కర్నూలు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రామచంద్రనాయుడు, డాక్టర్ ఎస్వీ రామమోహన్ రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ మాధవీశ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ కోసం రోడ్డెక్కిన ఉపాధ్యాయులు

- కేంద్రం అనుసరిస్తే, రాష్ట్రం వ్యతిరేకించడం భావ్యమా అని ప్రశ్న?


శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో నిరాహారదీక్ష చేస్తున్న ఉపాధ్యాయులు

కర్నూలు(సెంట్రల్): పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ డీఎస్సీ–2003 ఉపాధ్యాయులు రోడ్డెక్కారు. 2003లోనే నోటిఫికేషన్ వచ్చినప్పటికీ 2004లో పోస్టుల భర్తీ చేయడంతో పాత పెన్షన్ విధానం వర్తించదని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై వారు భగ్గుమన్నారు. కేంద్రంతో పాటు చాలా రాష్ట్రాల్లో 2003–04 సంవత్సరాల్లో ఎంపికైన ఉద్యోగులకు పాత పెన్షన్ ఇస్తుంటే ఏపీలో మాత్రం సీపీఎస్‌ను అమలు చేస్తామని చెప్పడంపై నిరసనకు దిగారు. శుక్రవారం ధర్నా చౌక్ వద్ద డీఎస్సీ–2003 ఉపాధ్యాయులు దీక్ష చేపట్టారు. వీరికి వివిధ ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ రాష్ట్ర నాయకులు హృదయరాజు మాట్లాడుతూ.. కేంద్రం పెన్షన్ శాఖ ఉత్తర్వుల ప్రకారం నోటిఫికేషన్ ఆధారంగా ఎంపికైన వారిని పాత పెన్షన్ పరిధిలోకి తీసుకురావాలని స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. గోవా, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పంజాబ్, హరియానా, ఢిల్లీ వంటి రాష్ట్రాలు ఇప్పటికే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ మాత్రం కొద్దిమంది ఐఏఎస్‌లకు మాత్రమే వర్తింపజేసి, అదే నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు, కానిస్టేబుళ్లను విస్మరించడం దారుణమైన నిర్ణయమన్నారు. మొత్తం 10,982 మంది ఉన్నారని, ఇందులో విద్యా శాఖకు సంబంధించి 7,361 మంది, హోం శాఖకు సంబంధించి 1821, ఇతర శాఖల్లో 1800 మందికి పాత పెన్షన్ వర్తింపజేయకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో అపాస్ నాయకులు సత్యనారాయణ, యూటీఎఫ్ నాయకులు రవికుమార్, ఎస్టీయూ నాయకులు గోకారి, పీఆర్‌టీయూ నాయకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.